# సాక్షి
## మంచిర్యాల

శనివారం, 23, నవంబర్, 2024




### కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

జైపూర్: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. మండలంలోని శివ్వారం, కిష్టాపూర్, పౌనూర్, టేకుమట్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వచ్చే రబీ సీజన్‌లో మహిళా సంఘాల ద్వారానే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేపట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ వనజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఆటలపోటీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో దివ్యాంగులకు ఆటపోటీలు నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి మాట్లాడుతూ 200 మంది దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించామని తెలిపారు. విజేతలకు డిసెంబర్ 3న బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఫీల్డ్ రిసోర్స్ అధికారి ఫర్జానా బేగం, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్, జూనియర్ అసిస్టెంట్ రవికాంత్, ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /15.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉదయం వేళ మంచు కురుస్తుంది. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### నేతకాని భవన్ ఏర్పాటు చేయాలి



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చెన్నూర్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నేతకాని ఆత్మ గౌరవ భవన్, నేతకాని కుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని మహార్ సేవా సంఘం నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

### 14న జాతీయ మెగా లోక్ అదాలత్

మంచిర్యాలక్రైం: డిసెంబర్ 14న దేశ వ్యాప్తంగా జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నారని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెటిపేటలోని కోర్టు సముదాయాల్లో లోక్ అదాలత్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు రాజీ కుదుర్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు రికవరీ, క్రిమినల్, కుటుంబ సంబంధాల, ప్రమాద బీమా, ప్రామిసరి నోట్ కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. 14న వీలు కాని పక్షంలో ఒక్క రోజు ముందుగానే కోర్టును సంప్రదించి కేసు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థను కలిసి ఉచితంగా సలహాలు పొందవచ్చని తెలిపారు.

### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: సమగ్రశిక్షాలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పేస్కేల్ ఇవ్వాలని శుక్రవారం డీఈవో యాదయ్య, కలెక్టర్ కార్యాలయ ఏవో రాజేశ్వర్‌కు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సమగ్రశిక్షాలో కేజీబీవీలో ప్రత్యేక అధికారులు, బోధన, బోధనేతరులు, ఎంఐఎస్‌సీవో, సీఆర్‌పీ, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ. 10లక్షలు, ఆరోగ్య బీమా రూ.10లక్షలు సౌకర్యం కల్పించాలని, పదవీ విరమణ చేసే వారికి రూ. 25లక్షలు చెల్లించాలని పేర్కొన్నారు. 15 రోజులపాటు దశలవారీ ఆందోళన చేస్తామని, సానుకూలంగా స్పందించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

### ధాన్యంలో తాలు ఉండకూడదు



గూడెంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

దండేపల్లి: కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే ధాన్యంలో తాలు, తప్పా ఉండకూడదని, తేమ శాతం 17లోపు ఉండేలా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మండల కేంద్రమైన దండేపల్లితోపాటు ముత్యంపేట, గూడెం, కన్నెపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్వాహకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డురకాలను వేర్వేరుగా కొనుగోలు చేయాలని, సన్నరకం ధాన్యాన్ని గుర్తించి ధ్రువీకరించే బాధ్యత వ్యవసాయ అధికారులదేనని అన్నారు. అనంతరం దండేపల్లి తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేశారు. ధరణి దరఖాస్తుల పెండింగ్ వివరాలపై ఆరా తీశారు. దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వ్యాధుల తీవ్రత, మందులపై అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో నిర్మాణంలో ఉన్న డార్మెటరీ హాల్‌ను పరిశీలించారు. తహసీల్దార్ సంధ్యారాణి, డీటీ విజయ, ఆర్‌ఐ భూమన్న, ఏవో అంజిత్‌కుమార్, ఏపీఎం బ్రహ్మయ్య, ఏఈవోలు అర్చన, మానిక, సీసీ కొమురవెల్లి పాల్గొన్నారు.

# ఖాకీలపై పని ఒత్తిడి..!




పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు(ఫైల్)

మంచిర్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం విధులు నిర్వర్తిస్తున్నారు. పండుగ రోజుల్లో, భార్యాపిల్లలతో కాస్త సమయం గడిపేందుకు తీరిక లేక పని ఒత్తిడితో సతమతం అవుతున్నారు. పోలీసు అధికారుల విధులకు సమయపాలన అంటూ ఉండ దు. లా అండ్ ఆర్డర్‌లో పని చేసే సిబ్బందికి ఉరుకులు పరుగులు మరీ ఎక్కువ. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తులు, కేసుల ద ర్యాప్తు, కోర్టులకు హాజరు కావడం, ఉన్నతా ధికారుల సమీక్షకు వెళ్లడం ఇలా బహుళ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఏఆర్, టీజీఎస్‌పీ సిబ్బందికీ తిప్పలు తప్పవు. పండుగలు, సభలు, సమావేశాలు, ప్రముఖుల బందోబస్తు అంటూ గంటల తరబడి నిలబడక తప్పదు. 24/7విధుల్లో ఉండాల్సి రావడంతో పోలీసులు శారీరక, మానసిక శ్రమకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారు. రక్తపోటు, మధుమేహం సర్వసాధారణం అవుతుండగా.. ప్రమాదకరమైన క్యాన్సర్, కిడ్నీ, బ్రెయిన్, గుండె జబ్బులతో ఆస్పత్రి పాలవుతున్నారు. వీటితోపాటు రోజువారీ విధి నిర్వహణలో మానసిక ఒత్తిడి సైతం అధికంగానే ఉంటోందని కొందరు పోలీసు అధికారులు వాపోతున్నారు.

**పోలీసు శాఖ ఒక్కటే ఇలా..**

ప్రభుత్వ రంగంలోని ఏ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకైనా వారంతపు(వీక్లీ ఆఫ్) సెలవులు ఉంటాయి. ఆ ఒక్క రోజు కుటుంబ సభ్యులతో వివిధ కార్యక్రమాల్లో ఉల్లాసంగా గడుపుతారు. ఏదో ఒక రకంగా కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేస్తున్నారు. మిగతా రోజుల్లో సమయపాలన ఉంటుంది. కానీ పోలీసు శాఖలో ఉద్యోగులు 24గంటలు విధుల్లో ఉండాల్సిందే. పోలీసు ఉద్యోగంపై మక్కువతో చేరిన వారు ఆ తర్వాత ఒత్తిడితో ప్రత్యామ్నాయంగా ఇతర ఉద్యోగాల్లో చేరుతున్న వారూ ఉన్నారు. ఇటీవల కొందరు పోలీసులు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గమనార్హం. ఎనిమిది గంటల పని విధానం, అదనంగా విధులు నిర్వర్తిస్తే అదనపు అలవెన్స్‌తోపాటు వారంతపు సెలవులు, ఇన్సెంటివ్‌లు కల్పించేందుకు పోలీసు ఉన్నతాధికారులు 2019లో అధ్యయనం చేశారు. అంతకంటే ముందే 2017 నవంబర్‌లో రామగుండం పోలీసు కమిషనరేట్‌లో అప్పటి కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ వారంతపు సెలవులకు శ్రీకారం చుట్టారు. కానీ అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలీసు విధులపై ఆవేదన వ్యక్తం చేస్తూ వారంతపు సెలవులు ఇవ్వాలని గళం విప్పారు. ప్రస్తుతం ఆయన సీఎంగా ఉండడంతో పోలీసు శాఖను ప్రక్షాళన చేసి వీక్లీ ఆఫ్‌లు, అదనపు అలవెన్స్‌లు అమలు చేస్తారనే ఆశాభావం పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.

### అనారోగ్యానికి ప్రధాన కారణాలు

- విధి నిర్వహణలో నిలబడి ఉండాల్సిందే. శాంతిభద్రతల విధులు మొదలుకుని ఏ ప్రత్యేక విభాగాల్లో పని చేసినా అధికారుల ఒత్తిడి వల్ల రక్తపోటు, మధుమేహం రావడానికి కారణమవుతుంది.
- ఎండ, వాన, చలి, దుమ్ముధూళి, కాలుష్యం ఇలా పలు రకాల వాతావరణ పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి రావడంతో జబ్బుల బారిన పడుతున్నారు.
- సమయానికి ఆహారం తీసుకోకపోవడం, తగినంత విశ్రాంతి లేక ఆరోగ్యం దెబ్బతింటోంది.

**జిల్లాలో కొందరు పోలీసుల ఆవేదన**

**తగిన విశ్రాంతి లేక..**

జిల్లాలో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరి పదేళ్లు అవుతోంది. వయస్సు 30 సంవత్సరాలు. ఇంత చిన్న వయస్సులోనే బీపీ, షుగర్ వచ్చాయి. పని ఒత్తిడి, సమయానికి తినకపోవడం, మానసిక ఒత్తిడి వల్లనే బీపీ, షుగర్ వచ్చాయి.

**పండుగ లేదు..**

పోలీసు ఉద్యోగమంటే ఎంతో ఇష్టంతో చేరాను. పదేళ్లకు ఉద్యోగం మీద విరక్తి వస్తోంది. నా స్నేహితులు ఇతర ప్రభుత్వ శాఖల్లో వివిధ ఉద్యోగాల్లో ఉన్నారు. పండుగలకు కలుసుకుందామని అంటుంటారు. కానీ పోలీసులకు పండుగలకు సెలవు ఇవ్వరు. కుటుంబంతో సరదాగా ఒక్క రోజు గడుపుదామంటే అవకాశం దొరకది. తి నడానికి ఇంటికి వచ్చి తింటుండగా ఫోను వస్తే ఉరుకాలే. వారంలో ఒక్క రోజైన సెలవు ఇస్తే బాగుంటుంది.

### వీక్లీ ఆఫ్ అమలులో ఇబ్బందులు

పోలీసు శాఖలో వీక్లీ ఆఫ్ అమలులో ఉన్నతాధికారులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కొరత వల్లే అమలులో అధికారులకు తలనొప్పిగా మారిందని జిల్లా స్థాయి అధికారి ఒకరు చెప్పడం గమనార్హం. జిల్లాలో సుమారు 8లక్షలకు పైగా జనాభా కు 26 పోలీసుస్టేషన్లు, 10 సర్కిళ్లు, 950 మంది పోలీసు సిబ్బంది, ఒక డీసీపీ, ముగ్గురు ఏసీపీలు పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ వెయ్యి మందికి ఒక పోలీసు ఉండాలి. కానీ సిబ్బంది కొరత వల్ల వారంతపు సెలవులు, 8గంటల పని విధానం అమలు కావడం లేదని క్షేత్రస్థా యి సిబ్బంది అంటున్నారు. ఉన్నతాధికా రులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. సరిపడా సిబ్బంది ఉంటే తప్ప వారంతపు సెలవుల అమలు సాధ్యం కాదని అధికారులు భావిస్తున్నారు.

- జిల్లా కేంద్రంలో బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ సతీష్ ఈ ఏడాది మే 5న స్విమ్మింగ్ చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురై నీటిలోనే మునిగి మరణించాడు. కొద్ది రోజులుగా వరుస విధులు నిర్వర్తించడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

### కుటుంబంతో గడపలేక పోతున్నాం..

పోలీస్ ఉద్యోగమంటే సమాజంలో మంచి గౌరవం ఉంటుందని చేరిన. గౌరవం మాత్రమే ఉంది. బంధువులు పెళ్లిళ్లు, పేరంటాలకు వెళ్దామంటే సెలవులు దొరుకవు. కనీసం భార్యాపిల్లలతోనా ఆనందంగా గడిపేందుకు సమయం దొరకది. నైట్ పెట్రోలింగ్ చేసి ఇంటికి వెళ్లిన తర్వాత పిలుపు వచ్చిందంటే ఉరుకాల్సిందే.

– పట్టణంలోని ఓ ఎస్సై

### అనారోగ్యానికి గురైనా విధులు

పోలీస్ ఉద్యోగం అంటే కత్తిమీద సామే. అందులో మహిళలు పోలీస్ ఉద్యోగం చేయడమంటే సాహసమే అవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కొన్ని సందర్భాల్లో అత్యవసర సమయంలో, అనారోగ్యానికి గురైన విధులు నిర్వర్తించాల్సిందే. ఇంట్లో వంట పని, కుటుంబం, భర్త, పిల్లలు అన్ని చూసుకోవాలి. పైగా ఉన్నతాధికారుల ఒత్తిడిని తట్టుకొని విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

– జిల్లాలో పని చేస్తున్న ఓ మహిళా ఎస్సై

### వ్యక్తిగత అవసరాలకు సెలవులు ఇస్తున్నాం



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి వ్యక్తిగతంగా అవసరం ఉందంటే సెలవులు ఇస్తున్నాం. విధుల్లో సైతం ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదు. సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. గతంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండేది. ప్రస్తుతానికి ఆ పరిస్థితి లేదు. ఇటీవల కొత్తగా శిక్షణ పూర్తి చేసుకున్న పోలీస్ కానిస్టేబు ళ్లు విధుల్లో చేరనున్నారు. సిబ్బంది సంఖ్య పెరుగుతోంది. దీని వల్ల పని ఒత్తిడి తగ్గుతోంది.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

## మంచిర్యాలలో క్యాన్సర్ సెంటర్

- ముల్కల నుంచి గోదావరిపై వంతెన
- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాలలో క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటుతో ఇక్కడే నిర్ధారణ, చికిత్స ఉంటుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, కొత్తగా మంజూరు చేసిన కేంద్రాలకు మంత్రులు దామోదర రాజనర్సింహా, శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రామాకేర్ సెంటర్‌ను వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ప్రాంగణం, క్యాన్సర్, ఆయుష్ కేంద్రాలను ఐబీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. తలసేమియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు పడకల పెంపుతో ఇబ్బందులు తీరినట్లేనని అన్నారు. హాజీపూర్ మండలం ముల్కల నుంచి బసంత్‌నగర్ విమానాశ్రయం వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణం ప్రక్రియ ఆరంభమైందని తెలిపారు. ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే వేంపల్లి పరిశ్రమలకు కేంద్రంగా మారుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలో రెండో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నామని, రూ.81కోట్లతో కోర్టు భవనాల నిర్మాణం, కాగజ్‌నగర్‌కు వెళ్లాల్సిన ఈఎస్‌ఐ ఆసుపత్రికి కలెక్టరేట్ పక్కనే స్థలం కేటాయించినట్లు వెల్లడించారు. 12 ఎకరాల్లో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియం, మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్‌లో కూరగాయాల మార్కెట్లు నిర్మిస్తామన్నారు. లక్సెట్టిపేటలో హైస్కూల్, జూనియల్ కాలేజీ విద్యార్థులకు ఒకే చోట 240మందికి హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ప్రపంచస్థాయి ఫిష్ పాండ్‌ను ఎల్లంపల్లి వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### జిల్లా స్పోర్ట్స్ కరాటే కమిటీ ఎన్నిక

పాతమంచిర్యాల: జిల్లా స్పోర్ట్స్ కరాటే కమిటీ ఎన్నికలు శుక్రవారం జిల్లా కేంద్రంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా విజ్జగిరి రవి, ప్రధాన కార్యదర్శిగా మాటూరి శివ మహేష్, కోశాధికారిగా ఎనగందుల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ముల్కల శంకర్, ఆవుల రాజనర్సు, జితేందర్, సంయుక్త కార్యదర్శులుగా జూల శ్రీనివాస్, న్యాయ సలహాదారుగా రహమతుల్లా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు కట్కూరీ వెంకటేష్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి కీర్తి రాజ్‌వీర్ పాల్గొన్నారు.

# ‘భగీరథ’ నిరుపయోగం

- కనెక్షన్లు ఇచ్చినా నీటి సరఫరా లేదు..
- అడుగడుగునా పైపులైన్ల లీకేజీలు..
- నేటికీ కొన్ని వార్డుల్లో పూర్తి కాని నల్లా కనెక్షన్లు
- ఇళ్ల ముందు పైపులు వేసి వదిలేసిన కాంట్రాక్టర్లు



లైన్‌గడ్డలో ఇంటి ముందు పడి ఉన్న భగీరథ పైపు

చెన్నూర్: తలాపునే గోదావరి నది ప్రవహిస్తున్నా తాగేందుకు నీరు లేక చెన్నూర్ పట్టణ ప్రజల గొంతెండుతోంది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ శుద్ధ జల పథకం నిరుపయోగంగా మారింది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి పథకం నీరుగారిపోయింది. ఈ పథకంలో భాగంగా ఆరు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. పైపులైన్లు పనులూ పూర్తి చేశారు. ఐదేళ్లు కావస్తున్నా చెన్నూర్ మున్సిపాల్టీ పరిధి ప్రజలకు తాగునీటి సరఫరాలో అధికారులు విఫలమయ్యారు. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు భారీ సంఖ్యలో ఇచ్చామని అధికారులు చెబుతున్నా కొన్ని వార్డుల్లో ఇప్పటికీ పూర్తి కాలేదు. పైపులైన్లు వేసి కనెక్షన్లు ఇవ్వలేదని లైన్‌గడ్డ కాలనీకి చెందిన మల్లక్క ఆవేదన వ్యక్తం చేసింది. నాసిరకం పైపుల కారణంగా అడుగడుగునా పైపులైన్లు లీకేజీలు ఏర్పడుతున్నాయి. నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. సాయంత్రం వేళ నీరు సరఫరా చేస్తున్నా లీకేజీల కారణంగా బిందెడు నీరు కూడా రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. లీకేజీలు అరికట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు న్నాయి. ప్రజలు బోర్ల ద్వారా సరఫరా అయ్యే నీటి నే తాగాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణ ప్రజలకు ప్రతీ రోజు 3.5ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ ఫర్ డే) అవసరం అవుతుంది. 18వార్డుల్లో 190బోర్లు, 40 చేతిపంపులు ఉన్నాయి. బోర్ల నుంచి వచ్చే నీరు ఉప్పుగా ఉండడంతో ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని వాటర్‌ట్యాంకు, మైసమ్మ ఆలయ సమీపంలోని నల్లా వద్ద నీటి తెచ్చుకుంటున్నారు. 2009లో పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు మండలంలోని రాయిపేటలో రూ.4.50కోట్లతో గోదావరి తాగు నీటి పథకం నిర్మించారు. రైతుల నుంచి భూమి సేకరించకుండా పైపులైన్ వేయడం వల్ల కొన్ని చోట్ల తొలగించారు. అడ్డదిడ్డంగా పైపులైన్ వేయడంతో నిధులు వృథా అయ్యాయి. నీటి సమస్యపై చెన్నూర్ డీఈ విద్యాసాగర్‌ను సంప్రదించగా.. లీకేజీలను సరి చేసి ప్రతీ ఇంటికి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని, కనెక్షన్లు లేని ప్రాంతాల్లో త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు.

### ఆరేళ్ల నుంచి చుక్క నీరు రాలే..



మిషన్ భగీరథ పైపులు వేసిండ్లు. ఇంటి ముందు పైపు వేసి నాలుగేళ్లు అయినా చుక్క నీరు రాలే. బిందెడు నీళ్ల కోసం బోర్ల చుట్టూ తిరుగుతన్నాం. భగీరథ నీళ్లు అప్పడిస్తాం.. ఇప్పుడిస్తామని అంటున్నారే తప్పా నీరు వచ్చింది లేదు. మేము తాగింది లేదు. బోరు నీళ్లు తాగలేక రోజు రూ.20 పె ట్టి మినరల్ వాటర్ క్యాన్ తీసుకుంటున్నాం.

– గుజ్జ రస్మిత, లైన్‌గడ్డ

### గోసైతాంది..

పైపులేసిండ్లు మంచినీరు రాదు. మంచినీళ్ల కోసం గోసైతాంది. వాన కాలం లేదు, ఎండకాలం లేదు. అన్ని కాలల్లో నీటికి తిప్పలు పడుతున్నాం. ఎన్నికలప్పుడు మంచినీరిస్తాం అంటున్నారు. ఎన్నికలైన తర్వాత మమ్ముల్ని పట్టించుకున్నోళ్లే లేరు. ప్రజాప్రతినిధులు మా గోస పట్టించుకొని నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– బందరుకంటి పోసక్క, శిశుమందిర్ కాలనీ

### చెన్నూర్ మున్సిపాలిటీ

| | |
|---|---|
| జనాభా | 23,579 |
| ఓటర్లు | 17,342 |
| వార్డులు | 18 |
| **తాగునీటి వనరుల వివరాలు** | |
| చేతిపంపులు | 40పని చేయడం లేదు |
| బోర్లు | 190 |
| **మిషన్ భగీరథ కనెక్షన్లు** | |
| మొత్తం | 7629 |
| పూర్తయినవి | 5676 |

# మామిడిగూడెంలో వైద్యశిబిరం

సాక్షి ఎఫెక్ట్..



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కాసిపేట: మండలంలోని మామిడిగూడెంలో వైద్యులు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ‘మంచం పట్టిన మామిడిగూడెం’ శీర్షికన శుక్రవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ భోజన్న ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి రవికిరణ్, వైద్యుల బృందం ఉదయమే గ్రామానికి చేరుకుంది. గ్రామంలో క్లోరినేషన్ నిర్వహించి అందరికీ వైద్య పరీక్షలు చేసి కొందరి రక్త నమూనాలు సేకరించారు. కొందరికే జ్వరాలు ఉన్నాయని, ఎక్కువ మంది ఒళ్లునొప్పులు, అలసటతో బాధపడుతున్నారని తెలిపారు. మురికి కాలువలు నిండి దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. వైద్యాధికారి రవికిరణ్ సూచన మేరకు ఎంపీడీవో పారిశుద్ధ్య పనులకు ఆదేశాలు ఇచ్చారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మురికి కాలువలు శుభ్రం చేశారు. వైద్య శిబిరాన్ని సాయంత్రం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని, వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, డీఈఎంవో వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# పొరపాట్లు లేకుండా నమోదు చేయాలి


- నిర్లక్ష్యం వహించవద్దు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్లు సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, ముఖ్య ప్రణాళిక అధికారి మహ్మద్ ఖాసీం, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావులతో కలిసి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ సర్వేలో ఎన్యుమరేటర్లు కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారని, ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో 562 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని, ఒక్కొక్కరికి 300 కుటుంబాల సమాచారం అందించామని, ఒక రోజులో కనీసం 30 కుటుంబాలకు తగ్గకుండా పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపా రు. డిసెంబర్ ఒకటిలోగా వివరాలు నమోదు పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. వివరాలు గోప్యంగా ఉంచాలని, నిర్లక్ష్యం, అలసత్వం వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు నమోదు తీరును వివరించారు.

# పఠనంపై ఆసక్తికి రూమ్ టు రీడ్



పాల్గొన్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడంపై ఆసక్తి పెంపొందించటం.. స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దడానికి రూమ్ టు రీడ్ ఎంతో దోహదం చేస్తుందని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ సెరీ కార్యక్రమం ఎఫ్‌ఎల్‌ఎన్‌కు అనుబంధంగా గర్మిళ్ల పాఠశాలలో ఏర్పాటు చేసి మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. లైబ్రరీలో వివిధ రకాల కథల పుస్తకాలు, పిల్లల ఆలోచన పరిధిని పెంచే విషయ పరిజ్ఞానం కలిగిన పుస్తకాలు పొందుపర్చారని తెలిపారు. పుస్తకాల ప్రదర్శనకు వీలుగా ఓపెన్‌రాక్స్, జ్యూట్ బ్యాగ్, పినప్‌బోర్డు, కార్పెట్స్, రీడింగ్ టేబుల్, పిల్లలకు అవసరమైన స్టేషనరీ అందుబాటులో ఉంచారు. ఎంఈవో మాళవిదేవి, జెడ్పీఎస్‌ఎస్ గర్ల్స్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, జెడ్పీఎస్‌ఎస్ గర్మిళ్ల ప్రధానోపాధ్యాయుడు భీంరావు, పాఠశాల హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ‘విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదు’



ఎంపీఓలతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల, గ్రామాల్లోని పంచాయతీ అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం డీపీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పారిశుద్ధ్య పనుల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్త వేరు చేసి కాంపోస్ట్ తయారు చేసేలా చూడాలని, నర్సరీల్లో మొక్కల పెంపకం, సంరక్షణ విధిగా జరగాలని, నీటి సరఫరా రిజిష్టర్ల నిర్వహణ విధిగా ఉండాలని అన్నారు. 26న ఓటరు జాబితాను స్థానికంగా ఆయా పార్టీల నాయకుల సమన్వయంతో పూర్తి చేయాలని, 26న గ్రామాల్లో పనుల జాతరకు సమాయత్తం కావాలని తెలిపారు.

## క్లుప్తంగా

### చంపుతానని బెదిరించిన మాజీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కందిమళ్ల ఆదినారాయణకు చెందిన భూమిలో కూలీ పనులు నిర్వహిస్తున్న తమను చంపుతానని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బెదిరించినట్లు బట్వాన్‌పల్లికి చెందిన రామటెంకి శరణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం చిన్నయ్య, అతని డ్రైవర్ కృష్ణ, గన్‌మెన్‌లు కూలీ పనులు చేస్తున్న తమ వద్దకు వచ్చారని పేర్కొన్నారు. నా భూమిలో మీరేం చేస్తున్నారు, ఇక్కడి నుంచి వెళ్లకపోతే చంపుతామని బెదిరించినట్లు శరణ్య తాళ్లగురిజాల స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్సై రమేశ్ వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ చేసి కేసు నమోదు అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

### లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్/వాంకిడి: యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో నమ్మించి లైంగికదాడికి పాల్పడిన కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు. వాంకిడి ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. వాంకిడి మండలం తేజాపూర్‌కు చెందిన నగోషె వినేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని మూడేళ్లుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెను లొంగదీసుకుని పలుమార్లు లైంగికదాడి చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి కుటుంబసభ్యులు వినేశ్‌ను అడగగా నిరాకరించాడు. సదరు యువతి 2021 నవంబర్ 20న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈమేరకు తీర్పునిచ్చారు. నేరస్తుడు వినేశ్‌కు శిక్షపడేలా చేసిన ప్రస్తుత ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ అధికారి రాంసింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు అభినందించారు.

### పేలిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ

మంచిర్యాలక్రైం: ఒక ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి మరో రెండు బైక్‌లు దగ్ధమైంది. జిల్లా కేంద్రంలోని చింతపండువాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పని నాగరాజు ఇంటి ఎదుట వేరే వ్యక్తులు ఐదు బైక్‌లు రోజులాగా గురువారం రాత్రి పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి సమయంలో ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి శబ్దం వచ్చింది. పక్కనే ఉన్న మరో రెండు బైక్‌లకు మంటలు అంటుకున్నాయి. నాగరాజు వెంటనే అప్రమత్తమై మరో రెండు బైక్‌లను అక్కడి నుంచి తొలగించాడు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు.

### పెంచికల్‌పేట్‌లో వైల్డ్ డాగ్స్



పెంచికల్‌పేట్: జిల్లాలో అరుదైన ఇండియన్ వైల్డ్ డాగ్స్ శునకాలు ప్రత్యక్షమయ్యాయి. మండలంలోని మురళిగూడ అటవీ ప్రాంతంలోని చెరువు వద్ద శుక్రవారం మూడు ఇండియన్ వైల్డ్ డాగ్స్ నీరు తాగుతుండగా యువకులు కెమెరాలో బంధించారు. పెంచికల్‌పేట్ అటవీరేంజ్ పరిధిలో 10 వరకు ఏషియన్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని అధికారులు తెలిపారు.



# ఆమెకు భరోసా..



- అభాగ్యులకు అండగా నిలుస్తూ..
- కౌన్సెలింగ్ చేస్తూ.. న్యాయ సహాయం అందిస్తూ..
- 52 జంటలను కలిపిన నిర్మల్ కేంద్రం



కౌన్సెలింగ్‌తో కలిసిన కుటుంబాలతో ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మహిళలు, పిల్లల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. లైంగిక వేధింపులు, దాడులకు గురైనవారికి అండగా నిలిచేందుకు ఇంటిగ్రేటెడ్ సపోర్ట్ సెంటర్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్(భరోసా) కేంద్రాలను నెలకొల్పింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయగా గత ఫిబ్రవరి 18న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, ఎస్పీ జానకీ షర్మిల ప్రారంభించారు. పోలీస్ శాఖ పర్యవేక్షణలో ఈ కేంద్రం నడుస్తోంది. అభాగ్యులు, బాధిత మహిళలు, బాలికలు, ఆపదలో ఉన్నవారికి తక్షణమే ప్రత్యేక సేవలు, న్యాయసహాయం లభిస్తోంది. సఖీ కేంద్రంలో బాధితులకు పునరావాసం కల్పిస్తోంది. ఇప్పటివరకు భరోసా ద్వారా ఏకమైన 52 జంటలను శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పోలీసు కుటుంబ సభ్యులు, వారితో కలిసి ఎస్పీ స్వయంగా భోజనం చేశారు.

**అవగాహన కార్యక్రమాలు**

జిల్లాలో తొలి మహిళా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిర్మల్ పోలీస్..మీ పోలీసు అంటూ.. జానకీషర్మిల ప్రజలకు మరింత దగ్గరయ్యారు. పాఠశాల, కళాశాలలు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో భరోసా కేంద్రంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటివరకు భరోసా కేంద్రాన్ని 176 జంటలు ఆశ్రయించాయి. ఇందులో 52 జంటలను ఏకం చేసి వారి జీవితాల్లో వెలుగులను నింపారు.



పోలీసు కుటుంబ సభ్యులతో భోజనం చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

### సేవలు ఇలా..

హింసకు గురైన పిల్లలకు భరోసా ఇస్తున్నాయి. మహిళలకు అత్యవసర, నాన్-ఎమర్జెన్సీ, వైద్య, చట్టపరమైన, మానసిక, కౌన్సెలింగ్ ఇస్తున్నాయి. ఈ కేంద్రంలో ఒక మహిళ ఇన్‌స్పెక్టర్, సైకాలజిస్టు, సపోర్టు పర్సన్, మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్, న్యాయవాది, రిసెప్షనిస్టు ఉంటారు. లైంగిక దాడులు, ఇతర వేధింపులకు గురైన పిల్లలు మానసిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కేంద్రంలో సేవల నిర్వహణ తీరు ఉంటుంది. ఇక్కడ పోలీసుస్టేషన్ తరహా వాతావరణం ఉండదు. బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వైద్య సేవలు నిర్వహిస్తారు. వేగంగా న్యాయ సేవలందేలా ఇక్కడ న్యాయవాది ఉంటారు.

### కౌన్సెలింగ్‌తో ఒక్కటయ్యాం



మాకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఒక పాప ఉంది. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. చాలా సందర్భాల్లో విడిపోవాలనుకున్నాం. భార్యతో ఉన్న వివాదంపై ఎస్పీ జానకీ షర్మిలను కలిసి వివరించాను. మా ఇద్దరిని భరోసా కేంద్రానికి పంపించారు. సుమంజలి మేడమ్ మూడుసార్లు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఒక్కటయ్యాం.

– కౌన్సెలింగ్‌తో ఏకమైన రమ్య, సురేశ్ దంపతులు, మామడ

### జీవితంలో వెలుగులు

మాకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబంలో ప్రతీరోజు గొడవలతో భార్య పుట్టింటికి వెళ్లింది. మానసికంగా కుంగిపోయాను. ఒకసారి భరోసా కేంద్రాన్ని ఆశ్రయించాను. ఇద్దరికి మూడుసార్లు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఏకమయ్యాం. ప్రతి వారం ఫోన్ చేస్తూ..మేము ఎలా ఉన్నామని కనుక్కుంటారు. భరోసా కేంద్రం ఆశ్రయించడంతో తమ జీవితంలో వెలుగులు నింపిన పోలీసులకు ధన్యవాదాలు.

– లావణ్య, చరణ్ దంపతులు,సిర్గాపూర్

### పోలీసులు అండగా ఉంటారు



బాధితులకు నిర్మల్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారు. బాధిత మహిళలు, యువతులు, బాలికలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. పాఠశాలల్లో పిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు, పిల్లల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం. జిల్లా ప్రజలు ఏ సమయంలోనైన సంప్రదించవచ్చు. తాము కుటుంబానికి దూరంగా ఉంటున్నామని బాధ కన్నా, ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం అవుతున్నామన్న సంతోషం ఉంది.

– జానకీ షర్మిల, ఎస్పీ

### ఒక్కటయ్యేలా చేసి..



మాకు ఐదు నెలల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాం. ప్రతీరోజు గొడవలు జరిగేవి. భార్య పుట్టింటికి వెళ్లింది. ఎస్పీని కలిసి వివరించాను. భరోసా కేంద్రానికి పంపించారు. ఎస్సై సుమంజలి, సిబ్బంది శిరీష.. జీవితంలో ఎలా బతకాలి, భార్యతో ఇలా నడుచుకోవాలనే అంశంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. భార్యను మెప్పించి ఒక్కటయ్యేలా ఎస్పీ కృషిచేశారు.

– ప్రవీణ, నరేశ్ దంపతులు

## విద్యార్థుల కోసమే వర్సిటీ దత్తత

- ఆర్జీయూకేటీని ఉత్తమంగా తీర్చిదిద్దుకుందాం
- ఎస్పీ జానకీషర్మిల



విద్యార్థులతో ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్, వీసీ గోవర్ధన్

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీని ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వర్సిటీని దత్తత తీసుకుంటున్నామని ఎస్పీ జానకీషర్మిల అన్నారు.వర్సిటీలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆర్జీయూకేటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంపూర్ణ సహాయం, విద్యార్థుల సమగ్ర రక్షణ కోసం గొప్ప సంకల్పానికి పూనుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు వారి లక్ష్యాలను చేరుకోవడంలో వారికి అవసరమైన మద్దతు, మార్గదర్శకత్వం అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. వర్సిటీని ఎస్పీ దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకు విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్, వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నగలు తాకట్టు.. ఖాతాలో జమకాని నగదు

- బెల్లంపల్లిలో ఘటన



బంగారం తాకట్టు పెట్టిన రశీదుపత్రం చూపిస్తున్న రాజేందర్

బెల్లంపల్లి: బంగారు నగలు తాకట్టు పెట్టిన వ్యక్తికి డబ్బులు బదిలీ కాకపోవడంతో కలకలం రేపింది. బెల్లంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన బాధితుడు కొటారపు రాజేందర్ తెలిపిన వివరాలు.. అత్యవసరంగా డబ్బులు అవసరం ఉండి నాలుగు రోజుల క్రితం 14 తులాల బంగారు నగలను ముత్తూట్ మనీలో తాకట్టు పెట్టాను. రూ.7.35 లక్షలను నా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో ఆన్‌లైన్ ద్వారా వెంటనే జమ చేస్తామని సిబ్బంది తెలిపారు. నాలుగు రోజులు గడిచినా నగదు జమ కాలేదు. కేవలం రూ.1 మాత్రమే రావడంతో ఆందోళనకు గురయ్యాడు. శుక్రవారం ముత్తూట్ మనీ కార్యాలయానికి వచ్చి ఆరా తీశాడు. సిబ్బంది పొంతన లేకుండా సమాధానం చెప్పారని, ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య వల్ల డబ్బులు జమకాలేదని చెప్పినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈమేరకు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు.

## ట్రిపుల్‌ఐటీని సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీని ఎమ్మెల్యే రామారావు పటేల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో సమస్యలు, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏ సమస్య ఉన్న విద్యార్థులు తనకు నేరుగా ఫోన్ చేయాలన్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అడ్మినిస్టేషన్ ఆఫీసర్ రణధీర్‌సాగిలతో భేటీ అయ్యారు. క్యాంపస్‌లో విద్యార్థుల ప్లేస్‌మెంట్స్ గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కాగా, స్వాతి మృతిపట్ల విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే..ట్రిపుల్ ఐటీని సందర్శించారు.

## ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలి



ప్రగతి చక్రం పురస్కారాలు పొందిన ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీలో ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారికి ప్రగతి చక్రం పురస్కారాలు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం సంస్థ ప్రగతికి పాటుపడుతున్న ఉద్యోగుల సేవలు మర్చిపోలేనివన్నారు. ఎప్పటికప్పుడు సంస్థ లాభాల బాట పట్టేలా వారంతా కృషి చేస్తున్నారన్నారు. ప్రయాణికులందరికీ మెరుగైన సేవలు అందించేందుకు తోడ్పాటును ప్రగతి చక్రం పురస్కారాల రూపంలో వారికి తిరిగి అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం. ప్రణీత్, డిపో మేనేజర్లు కల్పన, జనార్దన్ విశ్వనాథ్, హరిప్రసాద్, పీవో జిబ్లా, ఏవో శంకరయ్య, ఎంఎఫ్ శ్రీకర్, రాజేంద్ర, శివదాస్, పోతారెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

### పంట దిగుబడి రాలేదని రైతు ఆత్మహత్య



డుక్రే రాందాస్ (ఫైల్)

జైనూర్: పంట దిగుబడి రాలేదని రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. పట్నాపూర్ గ్రామానికి చెందిన రైతు డుక్రే రాందాస్(44) తన రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. దిగుబడి రాలేదని మనస్తాపం చెందాడు. గ్రామశివారులో గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి పడిపోయాడు. విషయం తెలుసుకున్న భార్య శకుంతల, మరిది దేవిదాస్‌లు అక్కడికి చేరుకుని అతన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పురుగుల మందు తాగి వ్యక్తి..

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలానికి చెందిన వెంకటి (57) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లో వెళ్తే..ఆదిలాబాద్‌లోని విద్యానగర్ గల హనుమాన్ ఆలయంలో వెంకటి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈయన సోరియాసిస్ వ్యాధితో బాధపడుతున్నా డు. చలి తీవ్రత పెరగడంతో బాధ తట్టుకోలేక గురువారం తిర్పెల్లి సమీపంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఒకరి బైండోవర్

జన్నారం: అక్రమంగా టేకు చెట్లు నరికివేతకు పాల్పడుతున్న మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన జాడి రాజంను తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు. కొన్ని రోజులుగా అక్రమ కలప రవాణాలో సహాయపడుతున్నాడని తేలడంతో బైండోవర్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

## ప్రతీకార హత్య కుట్ర.. భగ్నం

- నలుగురు నిందితుల అరెస్టు
- నాలుగు పిస్టోళ్లు, 18 రౌండ్ల మ్యాగ్‌జిన్స్, సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం
- నంద్యాలలో హత్య కోసం కాశీ నుంచి ఆయుధాల కొనుగోలు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: ప్రతీకార హత్యకు పన్నిన కుట్రను భగ్నం చేసిన పోలీసులు.. నిషేధిత జనశక్తి దళం ఏర్పాటు ప్రక్రియను మొదట్లోనే తుంచేశారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌లోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన మైల దిలీప్, నంద్యాలకు చెందిన అవులపాటి హిమకాంత్‌రెడ్డి ఉత్తరప్రదేశ్‌లోని కాశీ నుంచి నాలుగు పిస్తోళ్లు, ఎనిమిది మ్యాగజిన్స్, 18 లైవ్ రౌండ్స్ కొనుగోలు చేసి నంద్యాలకు తరలిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధి చాంద-టి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ గురువారం పట్టుకున్నారు. మరణాయుధాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిని విచారించగా కుట్ర కోణం బయపడింది. ప్రధాన నిందితుడు నంద్యాలలోని సున్నిపెంటకు చెందిన వొట్టి వెంకట్‌రెడ్డి గతంలో జనశక్తి పార్టీలో పనిచేశాడు. ఇతడిపై రెండు టాడా కేసులు, వివిధ సంఘ విద్రోహ కేసులతోపాటు మూడు హత్య కేసులు, ఒక హత్యాయత్నం కేసు, నాలుగు జనశక్తికి సంబంధించిన కేసులు ఉన్నాయి. సూర్యాపేటకు చెందిన తన మిత్రుడు హత్యకు గురికావడంతో ప్రతీకార చర్యగా, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో మళ్లీ జనశక్తి దళం ఏర్పాటుకు నిర్ణయించుకున్నాడు. మరణాయుధాల కొనుగోలుకు నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన నలగంటి ప్రసన్నరాజు ఆర్థికసాయం అందించాడు. వెంకట్‌రెడ్డి తన అనుచరుడైన హిమకాంత్‌రెడ్డి, మైల దిలీప్, అతడి రెస్టారెంట్‌లో పనిచేసే బీహార్‌కు చెందిన కుక్ భైరవ్‌లు కలిసి కాశీకి వెళ్లారు. అక్కడి నుంచి బీహార్‌లోని మ్యుంగేర్ రైల్వేస్టేషన్‌లో పిస్తోల్, బుల్లెట్లు తీసుకున్నారు. భైరవ్ కాశీలోనే ఉండిపోగా వారిద్దరు బయలుదేరారు. నంద్యాలకు వెళ్లే క్రమంలో ఆదిలాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడ్డ ఇద్దరిని విచారించడంతో వెంకట్‌రెడ్డి, ప్రసన్నరాజుల కుట్రను వెల్లడించారు. గురువారం రాత్రి వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కుట్రకు సంబంధించి మొత్తం తొమ్మిది మంది నిందితులు ఉన్నట్లుగా గుర్తించారు. వీరిలో నలుగురిని అరెస్ట్ చేయగా మిగతా ఐదుగురు పరారీలో ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. నాలుగు పిస్తోళ్లు, ఎనిమిది మ్యాగజైన్స్, 18 లైవ్ రౌండ్స్, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు ఫణీందర్, కరుణాకర్‌రావు, సాయినాథ్, ఎస్సై ముజాయిద్ పాల్గొన్నారు.

## బాసరకు పోటెత్తిన భక్తజనం

బాసర: కార్తిక శుక్రవారం సందర్భంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీసూర్యేశ్వర ఆలయంలో పూజలు చేశారు. సరస్వతి అమ్మవారి, పరమేశ్వరుని ఆలయాల్లో కార్తిక దీపాలు వెలిగిస్తున్నారు. అనంతరం మహాలక్ష్మి, మహంకాళి, సరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. తర్వాత చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని అధికారులు వెల్లడించారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చిన్నారికి అక్షర శ్రీకారం చేయిస్తూ..



గోదావరి నది వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు..